సాక్షి ఒడిశా

మంగళవారం । 28 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,96,490లు, బంగారం 80 మిల్లీగ్రాములు, వెండి 71 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రతిభతో విరిసిన పద్మాలు

పద్మ అవార్డుల విజేతలపై ప్రశంసలు కురుస్తున్నాయి. గవర్నర్, సీఎం కూడా అభినందించారు.

- 8లో



హుండీ ఆదాయం లెక్కింపు

మజ్జిగౌరి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కించారు. ఆరు నెలల తర్వాత హుండీ తెరిచారు.

- 8లో

నిధులు ఓకే.. విధులు వీకే

- ఖర్చు కాని బడ్జెట్ నిధులు
- మాజీ మంత్రుల ఆవేదన



ముఖ్యమంత్రి అధ్యక్షతన బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల సమావేశం

భువనేశ్వర్:

రాష్ట్రంలో విచిత్ర ఆర్థిక పరిస్థితి కనిపిస్తోంది. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో సద్వినియోగం కాలేదు. అతి త్వరలో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ స్వల్ప నిడివిలో మిగులు నిధుల వ్యయం అసాధ్యమయేయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు ఖర్చు చేయలేకపోవడం అత్యంత విచారకరమని రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన బడ్జెటు ముందస్తు సంప్రదింపుల సమావేశం పురస్కరించుకుని ఈ విషయం వెల్లడైంది. మరో వైపు బడ్జెటు అంచనాల ప్రకారం వసూళ్లు కూడా నిరాశాజనకంగా ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఆర్థిక మంత్రులతో ఆర్థికవేత్తలు ఇతరేతర ప్రముఖులు పాలు పంచుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణ కోసం కేంద్రం వాటా పరిమితిని పెంచి రాష్ట్ర వాటాను 10 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వానికి అభ్యర్థించారు. మూతబడిన గనుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆర్థిక నిపుణులు ప్రతిపాదించారు. వికసిత్ ఒడిశా వాస్తవ కార్య సాధన నేపథ్యంలో ప్రభుత్వం కొత్త బడ్జెటు రూపు రేఖల్ని ఖరారు చేస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. కొత్త ఆర్థిక సంవత్సరం 2025–26 సాధారణ బడ్జెట్‌ను ఫిబ్రవరి నెల 17న సభలో ప్రవేశపెట్టనున్నారు.

ఆదాయ, వ్యయం నిరుత్సాహం

బడ్జెట్ నిధుల ఆదాయ, వ్యయం నిరుత్సాహకరంగా కొనసాగింది. ఒక వైపు కేటాయించిన నిధులు సకాలంలో సద్వినియోగం కాలేదు. మరో వైపు పన్ను, పన్నుయేతర ఆదాయం ఆశాజనకంగా సాగలేదని మాజీ మంత్రులు పెదవి విరిచారు. రాష్ట్ర ఖజానా మరింత బలోపేతం చేసేందుకు బొగ్గు, ఖనిజాల రాయల్టీని పెంచాలని రాష్ట్రం దీర్ఘకాలంగా కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థిస్తుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం పెడ చెవి వైఖరి ప్రదర్శిస్తోంది. ఈ పరిస్థితిపై రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ప్రాధాన్యత కల్పించి కొత్త బడ్జెటు రూప కల్పన పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేపట్టాలని అభ్యర్థించారు.

అర్ధ వ్యయం, మొక్కుబడి ఆదాయం

2024–25 ఆర్థిక సంవత్సరపు బడ్జెటు కేటాయింపుల సమగ్ర సద్వినియోగం పూర్తిగా నిరుత్సాహకరంగా ఉందని ఆర్థిక నిపుణులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి బడ్జెట్ కేటాయింపుల్లో దాదాపు సగం వరకు (50 శాతం) మాత్రమే వెచ్చించారు. అత్యధికంగా కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరపు బడ్జెటు కేటాయింపు నిధులు వెచ్చించేందుకు 2 నెలల స్వల్ప వ్యవధి మాత్రమే ఉంది. మిగిలిన సగం బడ్జెటు నిధులు ఈ వ్యవధిలో సద్వినియోగం అయ్యే అవకాశాలు అంతంత మాత్రమేనని స్పష్టం అవుతుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం తరచూ ఆర్థిక భారం మోపుతోంది. సెస్‌లు, చార్జీల ద్వారా కేంద్రం తన ఖజానాను నింపుకుంటూ రాష్ట్ర ఆర్థిక వనరులకు గండి కొడుతుంది. ఈ పరిస్థితి నివారణపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల అమలు, కార్యాచరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా తగ్గించడం అనివార్యం. 60:40 నిష్పత్తిలో రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం అవాంఛనీయ ఒత్తిడి మోపుతుంది. ఈ పరిస్థితి నివారణ కోసం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, కార్యాచరణ కోసం నిధుల కేటాయింపు నిష్పత్తిని 90:10గా సవరించాలని సంప్రదింపుల సమావేశంలో చర్చకు వచ్చింది. ఫలితంగా రాష్ట్ర ఆదాయం పెరుగుతుందని మాజీ ఆర్థిక మంత్రులు ప్రతిపాదించారు.

సెస్ అదనపు ఆర్థిక వనరు

ఖనిజ తవ్వకాలపై సెస్ వసూలు రాష్ట్ర ఖజానాకు అదనంగా ఆర్థిక వనరుగా నిలుస్తుంది. ఈ మేరకు ఖనిజ సంపన్న రాష్ట్రాలు ఖనిజాలపై సెస్ విధించవచ్చని సుప్రీం కోర్టు తీర్పు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సి ఉంది. దీని వల్ల ఒడిశా వంటి గనులు, ఖనిజ నిక్షేపిత రాష్ట్రాలు ఏటా లక్షల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతున్నాయి.

ఆర్థిక సంఘం దృష్టి ఆకట్టుకోవాలి

రాష్ట్రానికి ఆర్థిక సాయం విస్తరణ కోసం 16వ ఆర్థిక సంఘం ఆగమనం సానుకూలంగా మలచుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కేబీకే, జగన్నాథ ఆలయానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీని పట్ల ఆర్థిక సంఘం స్పందన కొరవడింది. త్వరలో 16వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి విచ్చేయనుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదనను పునరావృతం చేయాలని తెలిపారు. రాష్ట్రంలో పర్యటన రంగం పురోగతికి అత్యంత ప్రాధాన్యత కల్పించాల్సి ఉందని హోటలు, రెస్టారెంట్ల సంఘం (హారో) అభ్యర్థించింది. రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకట్టుకునేందుకు స్టార్ హోటళ్ల అవసరం ఉంది. ఈ నేపథ్యంలో హోటల్ పరిశ్రమ కోసం రాష్ట్రంలో మరిన్ని స్టార్ హోటళ్లను ప్రారంభించేందుకు హారో రూ. 10,000 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించింది. పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకు 4 లక్షల ఇళ్లు నిర్మించాలని క్రెడాయ్ ప్రతిపాదించింది.

న్యూస్‌రీల్

వయోవృద్ధులకు షిరిడీ, నాసిక్ తీర్థయాత్ర ప్రారంభం



వయోవృద్ధుల తీర్థయాత్ర బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: వయోవృద్ధులకు ముఖ్యమంత్రి తీర్థ యాత్ర పథకం కింద సోమవారం షిరిడీ, నాసిక్ యాత్రల బస్సులకు శుభారంభం చేశారు. పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేసి జెండా ఊపి తీర్థ యాత్ర బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి మాట్లాడుతూ, 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా తీర్థయాత్రలకు తీసుకెళ్తోందని, ఈ పథకం ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి తిరిగి ఇంటికి క్షేమంగా చేరుస్తారని, దీన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గుసాని, కాశీనగర్ ఎన్.ఏ.సి, నువాగడ, పర్లాకిమిడి, గుమ్మాబ్లాక్, రాయఘడ, కాశీనగర్‌బ్లాక్ నుంచి 72 మందిని ప్రభుత్వం ఎంపిక చేసి షిరిడీ, నాసిక్ తీర్థయాత్రలకు పంపించారు. ఈ తీర్థ యాత్ర ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 2తో ముగుస్తుంది. ఒడిశా పర్యాటక కేంద్రం పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న మీదట వారికి తొలుత ఆరోగ్య పరీక్షలు చేసి తీర్థయాత్రలకు పంపిస్తామని డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి తెలిపారు. తీర్థ యాత్రలకు వెళ్లే యాత్రికులకు అండగా ఇద్దరు ఎస్కార్ట్స్, బరంపురం నుంచి షిర్డికి వెళ్లే ట్రైన్‌లో ఇద్దరు డాక్టర్లు, యాత్రికులకు కిట్లు అందిస్తామని అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, ఏడీఎం రాజేంద్ర మింజ్, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా స్పోర్ట్స్ అధికారి కమలకాంత పండా, గుసాని బీడీఓ గౌరచంద్ర పట్నాయిక్, తదితరులు పాల్గొని మాట్లాడారు.


ఉమ్మర్‌కోట్‌లో బ్లడ్ బ్యాంక్ ప్రారంభం



రక్తదాతలతో మాట్లాడుతున్న మంత్రి నిత్యానంద, ఎంపీ బలబద్రమజ్జిలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లో బ్లడ్ బ్యాంక్ ప్రారంభమైంది. దీన్ని రాష్ట్ర సాంఘీక సంక్షేమ, విద్యా శాఖా మంత్రి నిత్యానంద గొండో సోమవారం ప్రారంభించారు. అనేక ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజల డిమాండ్ చేస్తున్నప్పటికీ అమలు కాలేదు. 2018లో బ్లడ్ బ్యాంక్ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ అందుబాటు లోనికి రాలేదు. ప్రస్తుతం అన్ని హంగులతో అందుబాటులోకి వచ్చింది. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలబద్ర మజ్జి, తదితరులు పాల్గొన్నారు.


కొరాపుట్-కుంభమేళా బస్ సర్వీసు ప్రారంభం




కొరాపుట్‌లో కుంభమేళా బస్ ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్, ఎమ్మెల్యే రఘురాం తదితరులు

కొరాపుట్: కొరాపుట్ నుంచి కుంభమేళా జరిగే ప్రయాగ్ రాజ్‌కి ఓఎస్ఆర్‌టీసీ ప్రత్యేక బస్ సర్వీస్ ప్రారంభమైంది. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ వీ.కీర్తి వాసన్ ఈ బస్ ప్రారంభించారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠిలు జెండా ఊపారు. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బిభుతీ భుషణ్ జెన్నా కొరాపుట్‌లో పర్యటించినప్పుడు ప్రజలు ప్రత్యేక బస్ కావాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ బస్ సర్వీస్ ప్రారంభమైంది. ఈ బస్ ప్రయాగ్ రాజ్, వారణాశి, అయోధ్యలకు వెళ్లనుంది.

ముఖ్యమంత్రి సలహాదారుగా ప్రకాష్ మిశ్రా




ప్రకాష్ మిశ్రా



మధుసూదన్ పాఢి

భువనేశ్వర్: రాష్ట్ర విరామ పోలీసు డైరెక్టర్ జనరల్ ప్రకాష్ మిశ్రా ముఖ్యమంత్రి సలహాదారుగా నియమితులయ్యారు. కేబినెట్ మంత్రి హోదాలో నియమితులు కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజాకు అదనపు బాధ్యతలు కేటాయించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం న్యూఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ రెసిడెంట్ కమిషనర్ (సీఆర్‌సీ)గా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా మధుసూదన్ పాఢి నియమితులయ్యారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

- రాయగడ జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి



రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని రాయగడ జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. స్థానిక ఆర్టీవో కార్యాలయం ప్రాంగణంలో రోడ్డు భద్రత నెలరోజుల ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అబ్దుల్ కలాం ఫౌండేషన్, ఆర్టీవో కార్యాలయం సంయుక్తంగా నిర్వహించిన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అత్యవసరస పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఇటువంటి కార్యక్రమాల ద్వారా లభించే రక్తం వారికి ఎంతగానో వినియోగపడుతోందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానానికి యువత ముందుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ పరివేక్షణలో జరిగిన శిబిరంలో జిల్లా కేంద్రాస్పత్రికి చెందిన రక్తనిధి అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

నందన్ కానన్‌లో సింహం రేవా మృతి



రేవా(ఫైల్)

భువనేశ్వర్: స్థానిక నందన్‌కానన్ జంతు ప్రదర్శన శాలలో ఆడ సింహం రేవా సోమవారం మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. 2020 డిసెంబర్ 20వ తేదీన ఇండోర్‌లోని కమలా నెహ్రూ ప్రాణి సంగ్రహాలయ నుంచి రేవాని ఇక్కడకు తరలించారు. ప్రసవ సమస్యతో రేవా కన్ను మూసినట్లు ప్రకటించారు. గత ఏడాది అక్టోబర్ నెలలో గర్భం దాల్చిన నుంచి రేవాకు పూర్తి సంరక్షణ కల్పించారు. ఈ నెల 25న రేవా 103 రోజుల గర్భధారణ తర్వాత మూడు పిల్లల్ని ప్రసవించింది. జంతు వైద్య నిపుణుల పర్యవేక్షణలో రెండు కూనల ప్రసవం సునాయాసంగా ముగిసింది. 26వ తేదీ సాయంత్రం ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సోమవారం మూడో పిల్ల జననం విషయంలో పరిస్థితి విషమించడంతో సోమవారం సింహం చనిపోయినట్టు పేర్కొన్నారు.

రాష్ట్రంలో చలి పెరుగుదల



భువనేశ్వర్:

రాష్ట్రం అంతటా రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీని ప్రభావంతో చలి పెరుగుతోందని వాతావరణ నిపుణుడు ఉమాశంకర్ దాస్ వివరించారు. రాష్ట్రంలో రాత్రి పూట కనిష్ఠ ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ ఉందని వాతావరణ విభాగం చెబుతోంది. రాష్ట్రానికి చలి, పొడి గాలుల ప్రవాహం పెరుగుతుంది. ఇది ఉష్ణోగ్రత తగ్గుదల, చలి పెరుగుదలకు దారి తీస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రాత్రి పూట ఉష్ణోగ్రత ఇప్పటికే పలు ప్రాంతాల్లో 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ తగ్గినట్లు నివేదికలు తెలిపాయి. ఉక్కు నగరం రౌర్కెలా, ఝార్సుగుడ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రత 8 డిగ్రీల సెల్సియస్‌ఉ పరిమితమై వణికిస్తోంది. కెంజొహర్ 11.2 డిగ్రీల సెల్సియస్, సంబల్‌పూర్ 13.3, హిరాకుడ్‌లో 14.1 డిగ్రీల సెల్సియస్, బాలాసోర్‌లో 14.8 డిగ్రీల సెల్సియస్, చాంద్‌బాలి ప్రాంతంలో 17.6, రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో 18.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దట్టమైన పొగ మంచు

రాష్ట్రంలో రానున్న 48 గంటల పాటు దట్టమైన పొగ మంచు కమ్ముకునే అవకాశం ఉందని స్థానిక భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రాంతీయ కార్యాలయం ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ నేపథ్యంలో 14 జిల్లాలకు పసుపు హెచ్చరిక జారీ చేసింది. ఈ జాబితాలో కేంద్రాపడా, జాజ్‌పూర్, ఖుర్దా, పూరీ, కటక్, జగత్‌సింగ్‌పూర్, నయాగఢ్, గంజాం, గజపతి, కొరాపుట్, నవరంగ్‌పూర్, కలహండి, కంధమల్ మరియు సుందర్‌గఢ్ జిల్లాలు ఉన్నాయి. సోమవారం ఉదయం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకోవడంతో జనజీవనం ప్రభావితం అయింది. మంగళవారం కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముతుందని ఐఎండీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కేంద్రాపడా, జాజ్‌పూర్, కటక్, ఖుర్దా, పూరీ, జగత్‌సింగ్‌పూర్, నయాగఢ్, నవరంగ్‌పూర్, కొరాపుట్, కలహండి, కంధమల్ ప్రాంతాలకు పసుపు హెచ్చరిక జారీ చేశారు. రాష్ట్రంలో రానున్న 5 రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుంది.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జయపురం:

జయపురంలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి మరోసారి అధికారులు స్థల పరిశీలన ప్రారంభించారు. కేంద్ర విద్యాలయ అధికారులు గతంలో కేంద్రీయ విద్యాలయానికి ఎంపిక చేసిన స్థలాన్ని మరోసారి సోమవారం పరిశీలించారు. ఆ స్థలం మధ్యలో నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ ఉండటంతో వారు జయపురం రెవెన్యూ, టాటా పవర్ సప్‌లై కంపెనీ అధికారులతో చర్చించారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రదీప్ కుమార్ బదన మాట్లాడుతూ.. విద్యాలయం నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం మధ్యలో మూడు విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటిని మరో ప్రాంతానికి తరలించాలన్నారు. దీంతో టాటా విద్యుత్ సరఫరా కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వరుణ కుమార్ చౌదురి, ఎస్టిమేటర్ కాశీ చరణ్ బెహర, రశ్మీ రంజన్ సాహులతో వాటిని తొలగించే విషయంపై చర్చించారు. విద్యుత్ స్తంభాలను మరో ప్రాంతానికి తరలించేందుకు, ఇతర ఖర్చులు ఎంత అవుతుందో చర్చించారు. భూగర్భంలో వైరింగ్ చేసేందుకు అయ్యే ఖర్చుపై చర్చించారు. అలాగే స్తంభాలను మరో ప్రాంతానికి తరలిస్తే రెవెన్యూ అధికారులు అదనపు స్థలం మంజూరు చేసే విషయంపై రెవెన్యూ సూపరింటెండెంట్ హరిహర శతపది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సూరజ్ పట్నాయక్ మొదలగు వారితో ప్రిన్సిపాల్ చర్చించారు. అన్ని అడ్డంకులు అధికారులు తొలగించిన తరువాత పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గతంలో కేంద్రీయ విద్యాలయానికి అవసరమైన వనరులు ముఖ్యంగా తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు ఉండటంతో ఆ స్థలాన్ని ఎంపిక చేశారు. కేంద్ర విద్యాలయానికి పది ఎకరాల స్థలం కేటాయించాని సంబంధిత అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2020–21లో కేంద్ర విద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది ఎకరాలు మంజూరు చేసి కేంద్ర విద్యాలయ అధికారులకు అప్పగించారు.

స్వాతంత్ర్య పోరాటంలో మహాపాత్రో పాత్ర కీలకం

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీ



గధాధర మహాపాత్రో విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీ



మహాపాత్రో విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజలు

జయపురం:

దేశ స్వాతంత్ర్య పోరాటంలో స్వర్గీయ గధాధర మహాపాత్రో కీలకమైన పాత్ర పోషించారని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో స్వాతంత్ర్య యోధుడు గధాధర మహాపాత్రో విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొరాపుట్ స్వాతంత్ర్య పోరాటాల ఖని అన్నారు. సహిది లక్ష్మణ నాయిక్ లాంటి అనేక మంది యోధులు స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో పాల్గొని దేశం కోసం ప్రాణాలను అర్పించారని అన్నారు. విద్యార్థిగా ఉన్న సమయంలో దేశ భక్తి అలవరచుకున్న మహాపాత్రో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేపట్టిన విప్లవ పోరాటానికి ఆకర్షితులై తన 20 ఏళ్ల వయసులో 1942లో నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరారని గుర్తు చేశారు. అతడు జపాన్ సైనికులతో పోరాటం చేసి బందీ అయ్యాడని వెల్లడించారు. విడుదలైన తరువాత దేశాన్ని ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి ముక్తి కల్పించేందుకు నేతాజీ చేపట్టిన పోరాటంలో మహాపాత్రో ప్రధాన పాత్ర నిర్వహించి పోరాటం చేశారన్నారు. ఆ పోరాటంలో ఆయన ఆంగ్ల సైనికులకు చిక్కి 1945లో రంగూన్ జైలులో బందీ చేయబడ్డారని వివరించారు. అప్పటి నుంచి అతడిని సూరత్ జైలుకు తరలించారని వివరించారు. అక్కడ ఎనిమిది నెలలు జైలు జీవితం గడిపి 1946 ఫిబ్రవరి 23 వ తేదీన విడుదలైనట్టు గుర్తు చేశారు. గధాధర మహాపాత్రో జైలు నుంచి జయపురం వచ్చి ఒక ఉన్నత పాఠశాలలో క్రీడా ఉపాధ్యాయుడుగా పని చేశారన్నారు. 1975లో మహాపాత్రో పదవీ విరమణ చేశారన్నారు. ఆయన తన 79వ ఏట 2001లో స్వర్గస్తులయ్యారన్నారు. పట్టణ ప్రజలు మహాపాత్రో పోరాట పటిమను గుర్తించిన జయపురం మున్సిపాలిటీ అతడి విగ్రహాన్ని తయారు చేసి ఆయన పనిచేసిన పాఠశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించడం ప్రశంసనీయమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ యోధుల త్యాగాలు భావితరాల వారికి తెలియాలంటే వారి స్మృతి చిహ్నాలు నెలకొల్పటం అవసరమన్నారు. కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జయపురం సబ్‌డివిజన్‌లో అగ్నిమాపక సేవల విస్తరణ


రోబోట్ యంత్రాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న శౌశ్యా రెడ్డి


సబ్ కలెక్టర్‌కు రోబోట్ పనితీరుని రిమోట్ ద్వారా చూపిస్తున్న అగ్నిమాపక అధికారి

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో అగ్నిమాపక సేవలు మరింత విస్తృతంగా అందించేందుకు అవకాశం కలిగింది. జయపురం అగ్నిమాపక విభాగానికి 4 నూతన అగ్ని మాపక వాహనాలతో పాటు 40 లీటర్ల కెపాసిటీ గల రెండు ట్యాంకర్ల బులెట్ వాహనం, ఒక రోబెటింగ్ యంత్రం రాగా వాటిని జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వాహనాలతో అగ్నిమాపక విభాగ సామర్థ్యం మరింత పెరిగిందన్నారు. అగ్నిమాపక వాహనాలు వెళ్లలేని ప్రాంతాలకు బులెట్లు వెళ్తాయని అన్నారు. రోబోట్ ప్రాంతం కూడా మారుమూల ప్రాంతాలకు వెళ్తుందన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక విభాగ అధికారి సురేష్ కుమార్ బారిక్ కొత్తగా వచ్చిన వాహనాలను, యంత్రాలను, సిబ్బందిని సబ్ కలెక్టర్‌కు పరిచయం చేశారు.

బోండాఘటీలో రూటి పండగ


రూటి యుద్ధంలో దెబ్బలు తిన్న యువకుడు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి బోండాఘటిపై నివసిస్తున్న బోండా తెగ గిరిజనులు తమ సంప్రదాయ రూటి పండగను ఘనంగా నిర్వహించారు. తొలి పంట ధాన్యం తినడం కోసం ఉత్సవం జరిపి అనంతరం శింభ (చిక్కుడికాయలు) ఇతర పంటలు కొండదేవతకు సమర్పించి వారు తింటారు. పండగలో భాగంగా ప్రతి ఇంటిలోనూ భార్య భర్తకు విజయ తిలకం దిద్ది రూటి యుద్ధానికి పంపుతారు. యుద్ధం అనంతరం తమ రూటీలను అమ్మవారి వద్ద ఉంచి పూజిస్తారు. శాంతియుతం అయ్యాక భోజనాలు చేస్తారు. ప్రస్తుతం బోండా జాతి గిరిజనులు 8వేల మంది మాత్రమే ఉన్నారు.


యుద్ధం చూసేందుకు వచ్చిన బోండా గిరిజనులు

పరీక్ష పాస్ చేస్తామంటూ డబ్బులు వసూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్‌ల్లో పరీక్ష పాస్ చేస్తున్నామంటూ నాన్ టీచింగ్ సిబ్బంది కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఒక ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఈ మేరకు వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు కొందరు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా రీవాల్యుయేషన్, సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ అంశాన్ని ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ వద్ద ప్రస్తావించగా, అలాంటిది తమ దృష్టికి రాలేదని, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని అన్నారు. ఎవరైనా పాస్ చేస్తామంటే నమ్మ వద్దని, వర్సిటీలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. వర్సిటీలో పరీక్షల నిర్వహణ వ్యవస్థ పటిష్టంగా ఉందని అన్నారు. అపోహలు నమ్మవద్దని చెప్పారు.

పలాసలో 30న మినీ జాబ్ మేళా

కాశీబుగ్గ: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డీఆర్ఏ, సీడాప్ ఆధ్వర్యంలో పలాసలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 30న గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా మేనేజర్ రమణమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రెండు కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ పూర్తి చేసి 18–35 ఏళ్లు కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతిభతో విరిసిన పద్మాలు

- పద్మ పురస్కారం విజేతలు రాష్ట్రానికి గర్వ కారణం
- గవర్నరు, ముఖ్యమంత్రి అభినందనలు



అద్వైత చరణ్ గౌడొనాయక్, శిల్పి

భువనేశ్వర్: సాంస్కృతిక వారసత్వం, సాహిత్యం, వైద్య రంగాల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన ప్రముఖులు పద్మ పురస్కారానికి ఎంపిక కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పద్మ పురస్కార విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర గొప్ప సాంస్కృతిక, సంప్రదాయ, వారసత్వ విలువలతో కూడిన నైపుణ్యత, సాహిత్య పటిమ, ఆరోగ్య రంగంలో విశిష్టతతో ప్రతిష్టాత్మక పద్మ పురస్కారాలు పొందడం గర్వ కారణమని కొనియాడారు.

రాష్ట్ర జాబితాలో రాజ్ పథ్, జాతీయ యుద్ధ స్మారకం, జాతీయ పోలీసు స్మారకం వంటి ప్రముఖ ప్రాంగణాల్లో అపురూప శిల్పాల ఆవిష్కర్త, 61 ఏళ్ల శిల్పి అద్వైత చరణ్ గౌడొనాయక్, 2017లో ఒడిశాకు చెందిన జంట తల సోదరులు జగా, బలియాకు అరుదైన క్రానియోపాగస్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన 72 ఏళ్ల న్యూరో సర్జన్ డాక్టరు అశోక్ కుమార్ మహాపాత్రో, మానవ సంబంధాలు, భావోద్వేగాల పరిశోధన రచనలతో పాఠకులను ఆకర్షించిన 80 ఏళ్ల ప్రముఖ సాహితీవేత్త, ఒడిస్సీ శాస్త్రీయ నృత్య శైలికి ప్రపంచ ప్రాముఖ్యతను సాధించిన 73 ఏళ్ల ఒడిస్సీ గురువు దుర్గా చరణ్ రాణొబీర్ చోటు దక్కించుకున్నారు.

శిల్పి అద్వైత చరణ్ గౌడొనాయక్, కళ


కళా రంగం వర్గంలో పద్మ పురస్కార విజేతగా నిలిచిన అద్వైత చరణ్ గౌడొనాయక్ ఢెంకనాల్ జిల్లా నెవులొపాయి గ్రామంలో జన్మించి బీకే కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, న్యూఢిల్లీలోని కాలేజ్ ఆఫ్ ఆర్ట్, లండన్‌లోని స్లేడ్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో లలిత కళలను అభ్యసించారు. లలిత కళా అకాడమీ అవార్డు గ్రహీత. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీ రాజ్ ఘాట్ వద్ద దండి మార్చ్, ఇండియా గేట్ వద్ద 28 అడుగుల పొడవైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఏకశిలా నల్ల గ్రానైట్ విగ్రహం, ఢిల్లీ చాణక్యపురిలో 30 అడుగుల ఎత్తైన నల్ల గ్రానైట్ ఏకశిలా జాతీయ పోలీసు స్మారక చిహ్నం వంటి అపురూప శిలా ఖండాల్ని తీర్చిదిద్ది విశిష్టతని చాటుకున్నారు.


రాజ్‌పథ్‌లో దండి మార్చ్ ప్రతిమ

డాక్టర్ అశోక్ కుమార్ మహాపాత్రో


డాక్టరు అశోక్ కుమార్ మహాపాత్రో, వైద్య నిపుణుడు

బరంపురం ఎంకేసీజీ వైద్య బోధన ఆస్పత్రి పూర్వ విద్యార్థి. న్యూ ఢిల్లీ ఎయిమ్స్ న్యూరో సైన్సెస్ సెంటర్‌కి చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2012 నుంచి 2016 వరకు ఎయిమ్స్ భువనేశ్వర్‌కు తొలి డైరెక్టర్‌గా బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. 2017లో తలలు కలిసి జన్మించిన జగ మరియు బలియాకు భారత దేశపు మొట్టమొదటి విజయవంతమైన క్రానియోపాగస్ శస్త్రచికిత్సకు నాయకత్వం వహించిన ఘనత సొంతం చేసుకున్నారు. మెదడు కణజాలం, నరాలు, ప్రధాన రక్తనాళాల విభజన శస్త్ర చికిత్సతో ఈ కవలలకు ఊహాతీతమైన జీవం పోసిన కీర్తితో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం చేజిక్కించుకున్నారు. ప్రస్తుతం స్థానిక శిక్ష్యా ఓ అనుసంధాన్ (ఎస్ఓఏ) అకాడమీ ఆఫ్ సైన్సెస్ మరియు రీసెర్చ్‌కి ప్రధాన సలహాదారు (ఆరోగ్య శాస్త్రాలు)గా వ్యవహరిస్తున్నారు.


జాతీయ పోలీసు స్మారక శిల్పం

ప్రతిభా శత్పతి, సాహిత్యం, విద్య


ప్రతిభ శత్పతి, సాహితీవేత్త

కటక్ సత్యభామాపూర్ గ్రామంలో జన్మించిన ప్రతిభా శత్పతి ఒడియా సాహిత్యంలో కవయిత్రిగా ప్రసిద్ధి చెందారు. 1960లలో తన రచన 'శేష జొన్హా' ఆమె సాహితీ రంగంలో మైలురాయిగా నిలిచింది. ఆమె కవిత్వం మానవ సంబంధాల అంతరార్థం ఆవిష్కరించడం విశేషం. మానవ సంబంధాల విలువల పరిరక్షణ దిశలో కొనసాగించిన సాహితీ సాధన అశేష పాఠకుల ప్రియ రచయితగా గుర్తింపు సాధించింది. ఆమె రచన తన్మయ ధూళి కవితా సంకలనానికి 2001లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకుంది. సంపాదకురాలిగా పత్రికా రంగంలో 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో తనదైన ఉనికిని బలపరచుకున్నారు.


జాతీయ యుద్ధ స్మారక కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్ర బోసు ప్రతిమ

దుర్గా చరణ్ రణబీర్, నృత్య గురువు


దుర్గా చరణ్ రాణొబీర్, నృత్య కళాకారుడు

ఖుర్దా జిల్లా కామగురు గ్రామంలో 1951లో జన్మించారు. నృత్యాయన్‌నాట్య సంస్థ వ్యవస్థాపకుడు. ఒడిస్సీ నృత్య శిక్షణకు తరచు సరికొత్త శిక్షణ పద్ధతులను ఆవిష్కరించిన దిట్టగా పేరొందారు. ఈ రంగంలో ఆయన 5 దశాబ్దాలకు పైబడి ఎన్నో అద్భుత పరిశోధనలు చేసి ఒడిస్సీ నృత్య కళారంగానికి సేవ చేశారు. ఒడిస్సీకి ఆయన చేసిన విశేష కృషికి సంగీత నాటక అకాడమీ అవార్డు, భంజా కళా కేంద్రం నుంచి వేద వ్యాస్ అవార్డు ఒరిస్సా ప్రెస్ అకాడమీ నుంచి ఒరిస్సా సమ్మాన్ వంటి అనేక ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు.

గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువ

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ అల్లడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్సు సెల్‌కు అధిక స్పందన లభించింది. ఈ సంయుక్త గ్రీవెన్సు సెల్‌కు కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి గుణనిధి నాయక్, కాశీనగర్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ చైర్‌పర్సన్ ఎం.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. కాశీనగర్ మండీలో ఖరీఫ్ ధాన్యం 3000 క్వింటాళ్లు అధికారులు కొనుగోలు చేయడం లేదని కలెక్టర్‌కు ఖండవ గ్రామ పంచాయతీ పురుటిగూడ రైతులు వినతిని అందజేశారు. పురటిగూడ సహకార సంఘం ఆధ్వర్యంలో మిల్లర్లు ధాన్యం కోనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారని ఖండవ నాయిబు సర్పంచ్ రోక్కం సతీష్ అన్నారు. వెంటనే పురటిగూడ రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలె చేయాలని వినతి అందజేశారు. స్పందన కార్యక్రమానికి కిడిగాం, గోరిబోంద, అల్లడ గ్రామ పంచాయతీల నుంచి దాదాపు 46 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో కాశీనగర్ బీడీఓ డంబురదల మల్లిక్, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.



అల్లడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్పందన కార్యక్రమం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్


కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సర్పంచ్ రోక్కం సతీష్

గ్రీవెన్స్ సెల్‌లో 38 వినతుల స్వీకరణ


కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు సమస్యను వివరిస్తున్న దంపతులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో 38 వినతులను అధికారులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ స్వయంగా వెళ్లి బొండా గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఖోయిర్‌పూట్‌లో ఉన్న రెండు పంచాయతీలతోపాటు ఆంద్రాహాళ్, ముదిలిపోడ, కుడుములగుమ్మ పంచాయతీ వాసులు వినతులు అందించడగా.. జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా సబ్ కలెక్టర్ దూర్యధన్ బోయి, ఖోయిర్‌పూట్ పాల్గొన్నారు.


వినతులు అందజేస్తూ..

వినతుల స్వీకరణ


ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ ఫరూల్ పట్వారీ


రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితిలో గల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 95 వినతులను స్వీకరించారు. ఇందులో 56 వ్యక్తిగత సమస్యలు కాగా మిగతా గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఇందులో భాగంగా ముగ్గురు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 35 వేల రుపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. స్వీకరించిన వినతులను సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన సమాధాన పరచాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, జిల్లా ముఖ్యవైద్యధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళలు

రాయగడ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం మజ్జిగౌరి అమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. పోలీసుల భద్రత మధ్య మందిరం ప్రాంగణంలో గల 9 హుండీలను ఉదయం 10.30 గంటలకు తెరిచారు. స్థానికంగా గల సేవా సంస్థలకు చెందిన 150 మంది మహిళలు, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు ఇప్పిలి సన్యాసి రాజు, దేవేంద్ర బెహర, రాధాకృష్ణ దొలాయి, అదనపు తహసీల్దార్ తదితరుల సమక్షంలో హుండీలు తెరిచారు.

కానుకల రూపంలో 93 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.170 కిలోల వెండి లభించగా నగదు రూపంలో రూ. 94,49,054 లభించింది. గత ఏడాది జులై 24వ తేదీన హుండీ లెక్కించగా అప్పట్లో 53 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.392 కిలోల వెండి, 99 లక్షల 15 వేల 422 రూపాయల నగదు లభించింది. ఆరు నెలల తరువాత మళ్లీ అమ్మవారి హుండీని తెరిచారు. మందిరం అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.37 కోట్ల నిధులను అప్పటి బీజేడీ ప్రభుత్వం కేటాయించింది. త్వరలో ఆ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.


మందిరం ట్రస్టు సభ్యుల పరివేక్షణలో కొనసాగుతున్న లెక్కింపు


పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు

సీహెచ్‌సీ ప్రారంభం

రాయగడ: జిల్లాలోని కొలనారలో సుమారు 2.76 లక్షల రుపాయల వ్యయంతో నిర్మించిన సీహెచ్‌సీని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మహేష్ మహాలింగ్ ప్రారంభించారు. గణతంత్ర దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా భవనాన్ని ఆదివారం సాయంత్రం ప్రారంభించారు.

వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఆధునిక వసతులతో రొగులకు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, కలెక్టర్ ఫరూల్ పట్వారీ, తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్‌సీని ప్రారంభించిన మంత్రి మహాలింగ్

రహదారి పనులకు రూ.8.52 కోట్ల ప్రతిపాదన

జయపురం: స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు ఆక్రమణలు తొలగించి రెండున్నర నెలలు గడచినా రోడ్డు, డ్రైనేజ్ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజలు కష్టాలు పడుతున్నారు. రోడ్డు, డ్రైనేజ్ పునరుద్ధరణ పనులు ఫిబ్రవరి మొదటి వారం తరువాత ప్రారంభించేందుకు అధికారులు నిర్ణయించారు. అవసరమైన టెండర్లు పిలువనున్నారు. వెల్‌కం జంక్షన్ నుంచి బెల్ రోడ్డు వరకు పనులు ప్రారంభించనున్నారు. ఆక్రమణల తొలగింపు అనంతరం పడగొట్టిన, పడగొడుతున్న ఇళ్లు, దుకాణాలను మరోసారి పరిశీలించి ఇంకా పడగొట్టే పనులను 4 రోజుల్లోగా పూర్తిచేయాలని, వాటి యజమానులకు తాకీదు ఇవ్వనున్నట్లు తెలిసింది. ఈ రోడ్డు విస్తరణ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రహరీ 5 అడుగుల లోపలికి తీసుకువెళ్తారని తెలిసింది. ఎం.జి రోడ్డులో కొంతమంది బిల్డింగ్‌ల యజమానుల కింద పోర్షన్‌లు తొలగించినా పైన ఉండే పోర్షన్‌లు తొలగించలేదని అటువంటి వారికి నోటీసులు ఇస్తున్నట్లు తెలిసింది. ఎం.జి రోడ్డులో అక్రమణలు తొలగింపు చేపట్టి రెండు నెలలకు పైనే అయినా ఇంకా పూర్తి కాకపోవటంతో అధికారులు అసంతృప్తితో ఉన్నారు. వెంటనే తొలగింపు పనులు పూర్తి చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు అధికారులు నిర్ణయించారు. ఆర్అండ్‌బీ విభాగ అధికారుల వివరణ ప్రకారం ఎం.జి రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.8 కోట్ల 52 లక్షలు ఖర్చు బడ్జెట్‌ను రూపొందించారు.


ఎం.జి.రోడ్డు

పక్షుల సంరక్షకురాలికి సత్కారం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి చెందిన యువతి దీపారాణి నాయిక్‌కు ఆదివారం ఢిల్లీలో వన్యప్రాణుల సంరక్షణ స్వచ్ఛంద సేవలకుగాను సత్కరించారు.పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి తను చదువు పూర్తి చేసిన తరువాత ఇంటి చుట్టూ వస్తున్న చిలుకలు, పిచ్చుకలు, పావురాలను చూసిన ఆమె.. వాటి కోసం రోజు ఆహారంగా బియ్యంతోపాటు నీరు పెట్టేది. దీంతో రోజూ పక్షులు రావడంతో వాటి కోసం చిన్న చిన్న గూళ్లను ఏర్పాటు చేశారు. ఇలా 2014 నుంచి వందలాది పక్షులు తన ఇంటి చుట్టూ తీరగడంతో ఆమె ఆనందంగా వాటిని సంరక్షించేది. దీంతో 2023లో ఆమె పేరును సంజాయ్ కుమార్ రాసిన ఆవోగొరైయా అనే పుస్తకంలో ప్రస్తావించారు. ఆ తరువాత ఆమెకు అనేక పురస్కారాలు లభించాయి. 2023లో ప్రకృతి బందు అవార్డును అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఒడిశా రాష్ట్రం తరఫున దిపారాణి నాయిక్‌ను సత్కరించారు.


తోటివారితో దీపారాణి నాయిక్


దీపారాణి నాయిక్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


పరుగు పందాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక

రాయగడ: చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అన్నారు. స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వార్షిక క్రీడోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. అదే తరహాలో ప్రతీ విద్యార్థి క్రీడల్లో ఆసక్తి కనబరచాలన్నారు. అనంతరం పరుగు పందాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగాధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ పాత్రో, నర్సింగ్ విభాగం ప్రిన్సిపాల్ కె.ఉర్మిల, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


అదృశ్యమైన దత్తి చైతన్య

నెల్లిమర్ల రూరల్: మండలంలో కొండవెలగాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన దత్తి చైతన్య(17) కొండవెలగాడలో ఇంటర్ చదువుతున్నాడని ఈ నెల 23న కళాశాల నుంచి బయటకి వెళ్లి అప్పటి నుంచి ఇంటికి చేరుకోలేదన్నారు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అదృశ్యమైన వివాహిత మృతి


నూతిలోనుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం


కంచిపాటి వాణి (ఫైల్)

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన అదృశ్యమైన మహిళ కంచిపాటి వాణి (46) మృతి చెందినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్సై అందజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వాణి మతిస్థిమితం లేక శనివారం సాయంత్రం ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీనిపై భర్త, కుటుంబసభ్యులు వెతికినప్పటికీ కనిపించకపోవడంతో వాణి తండ్రిఅరిగి అప్పలసూర్యనారాయణ ఆదివారం ఫిర్యాదు చేశారు. సోమవారం బొద్దాం సమీపంలో నూతిలో వాణి మృతదేహం తేలినట్లు సమాచారం రావడంతో మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డైరెక్టర్ వైఖరి సరికాదు

పార్వతీపురంటౌన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెడతామని చెప్పడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రవీణ్ ప్రకాశ్ మాదిరిగానే వ్యవహరిస్తున్నారని, వైఖరి మార్చుకోకపోతే గుణపాఠం చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ఐకాన్ పురస్కారానికి రామినాయుడు ఎంపిక



సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయపురం గ్రామానికి చెందిన నిలురొతు రామినాయుడు గత 45 సంవత్సరాల నుంచి పౌరాణిక నాటక రంగంలో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక, వివేకానంద జయంతి ఉత్సవాలు–2025ను పురస్కరించుకుని ఇండియన్ ఐకాన్ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు. ఈ అవార్డును ఫిబ్రవరి 2న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం చేస్తారని, అవార్డు తీసుకునేందుకు నిర్వాహకులనుంచి ఆహ్వానం అందిందని రామినాయుడు తెలిపారు.

30వేల ఇళ్లకు సౌర విద్యుత్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో సుమారు 30 వేల ఇళ్లకు పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని కలెక్ట ర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం సాయింత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. జిల్లాలో 24,754 మంది ఎస్సీ లబ్ధిదారు లు, 4,569 మంది ఎస్టీ లబ్ధిదారులు, 6,897 మంది ఇతర లబిదారులు ఈ పథకానికి పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. రిజిస్టర్ చేసుకు న్న వారంతా ఏయే మహిళా సంఘాల పరిధిలోకి వస్తారో మున్సిపాల్టీలు, గ్రామాలు వారీగా సర్వే చేసి జాబితాలను నెలఖారులోగా రూపొందించాలన్నారు. వీరి స్వయం శక్తి సంఘాల సభ్యులకు స్త్రీ నిధి ద్వారా, ఇతర సభ్యులకు బ్యాంకులు ద్వారా రుణాలను ఇప్పించి పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ చిట్టిరాజు, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతిపై విచారణ

శృంగవరపుకోట: మండలంలోని ధారపర్తి పంచాయతీ చిలకపాడు గ్రామానికి చెందిన ఏడాది వయస్సున్న బాలుడు జన్ని విజయ్ మృతిపై డీఐవో అచ్యుతకుమారి మంగళవారం విచారణ జరిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది స్థానికంగా ఉండడంలేదని, సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవిస్తున్నాయని గిరిజన యువకులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ విచారణ జరిపి వివరాలు డీఎంహెచ్‌ఓకు సమర్పిస్తామన్నారు. ఆమె వెంట కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక, హెచ్ఈఈ రత్నకుమారి, ఏఎస్ఓ మురళి, తదితరులు ఉన్నారు.


పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


శంబర పోలమాంబ అమ్మవారు

- అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు
- ఏఎస్పీ దిలీప్‌కిరణ్ పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు
- ఉత్సవంలో పాల్గొన్న రైతులు

కనుల పండువగా.. పోలమాంబ తొలేళ్లు


కోళ్లు,మేకలు చెల్లిస్తున్న గిరిజనులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు వివిధ ప్రాంతాలనుంచి శంబర గ్రామానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కుటుంబసభ్యులతో సోమవారం ఉదయం శంబర చేరుకున్నారు. చదురుగుడిలో, వనంగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు దర్శించుకోగా, ఈవో వీవీ సూర్యనారాయణ సాదరంగా స్వాగతించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. చదురుగుడిలో అమ్మవారి ఘటాలకు కలెక్టర్ దంపతులు పూజలు నిర్వహించి, తలపై అమ్మవారి ఘటాలను ఎత్తుకున్నారు. అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ జాతర బందోబస్తుపై పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు.

తొలేళ్ల ఉత్సవం సాగిందిలా..

ఆదివారం రాత్రి 11గంటల సమయంలో అమ్మవారి ఘటాలకు తిరువీధి చేసిన అనంతరం, కారుగేద వాలకాలను నిర్వహించారు. మహిషాసుర మర్దిని వేషధారణ, పోతురాజు వేషధారణ, మేళతాళాల నడుమ కారుగేదవాలకం జరిపించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఉపవాసాలు ఆచరించి, గ్రామపెద్దలంతా జన్నివారిని పిలిచి రాత్రి 10గంటలకు ఏరోత్సవం నిర్వహించారు. జన్నివారి, గిరిడవారి ఇళ్లనుంచి విత్తనాలను తీసుకువచ్చి అమ్మవారి వద్ద విత్తనాలు ఉంచి, పూజలు నిర్వహించారు. అమ్మవారికి అక్షింతలు చల్లి పూజచేసి, రైతులు కాడిపై(పశువుల ఏరుకు పూసిన పూజు) నిలబడి రైతులు మొక్కులు చెల్లించారు. విత్తనాలను రైతులంతా వారివారి ఇళ్లకు తీసుకు వెళ్లారు. ఖరీఫ్‌సాగులో ఈ విత్తనాలు కలిపి పంటలు సాగుచేయడం ఆనవాయితీగా వస్తోంది.


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

పోలమాంబ అమ్మవారిని భక్తులు సోమవారం దర్శించుకున్నారు. గోముఖి బ్రిడ్జి వద్ద కోళ్లు, మేకలను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వనంగుడి వెనుక ఉన్న పురాతన వేపచెట్టుకు పూజలు చేశారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అమ్మవారికి ఘటాలను భక్తులు మొక్కుబడిగా చెల్లించారు. చీపుళ్లతో వీధిరహదారులును శుభ్రంచేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. కురుపాం మండలం మూలిగూడ గ్రామానికి చెందిన సుమారు 50మంది గిరిజనులు జాతరకు చేరుకుని, అమ్మవారికి మేకలు, కోళ్ల మొక్కుబడులు చెల్లించి గోముఖినది వద్ద వంటావార్పు చేసుకున్నారు.

జాతర బందోబస్తుకు చేరుకున్న పోలీసులు

ఎస్పీ వి.మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్‌ల పర్యవేక్షణలో జాతర బందోబస్తుకు శంబర గ్రామానికి సోమవారం ఉదయం పోలీసులు చేరుకున్నారు. ఏఎస్పీ దిలీప్‌కిరణ్ జాతరలో బందోబస్తుపై సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. జాతరలో ఎస్టీఎఫ్ బలగాలు పహారా కాశాయి.


పోలీస్‌సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ దిలీప్‌కిరణ్


తలనీలాల మొక్కు చెల్లిస్తున్న చిన్నారి


తలపై ఘటాలు ఎత్తుకున్న కలెక్టర్ దంపతులు


కారుగేదవాలకం

జాతర ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. క్యూలు, తాగునీటి సౌకర్యం, ప్రసాదాలు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, దుస్తుల మార్పిడి గదులు, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ షేక్‌ఇబ్రహీం, ఈవో వీవీ సూర్యనారాయణలకు సూచించారు. గ్రామానికి చెందిన వడ్రంగులు సిరిమానును సంప్రదాయ పద్ధతుల్లో మలిచారు.


పహారా కాస్తున్న ఎస్టీఎఫ్ బలగాలు

రూ.110 కోట్లతో ట్రైకార్ పథకాలకు ప్రతిపాదనలు

- ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు
- గిరిజన గ్రామాల్లో పర్యటన


గిరిజనులతో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

సీతంపేట: రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ట్రైకార్ పథకాల అమలుకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పెట్టినట్టు ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బి.శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు సీతంపేట ఏజెన్సీలో సోమవారం ఆయన పర్యటించారు. క్షేత్రస్థాయిలో పలు గ్రామాల్లో ఐటీడీఏ అమలు చేస్తున్న పథకాలను పరిశీలించారు. కిరాణాషాపులు, టెంట్‌హౌస్‌లు, వాహనాలు, సూపర్‌బజార్‌లు గిరిజనులు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా 90 శాతం సబ్సిడీపై రుణాలు ఇవ్వనున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మోహన్‌కాలనీ, బిల్లగూడ గ్రామాల్లో మారిషస్ పైనాపిల్ వేసిన రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించనున్నామన్నారు. సోలార్ తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరారు. పులిపుట్టి గోకులం షెడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలను సందర్శించి విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహం పరిశీలించారు. మెట్టుగూడ జలపాతం, అడ్వెంచర్ పార్కును సందర్శించారు. అనంతరం స్థానిక ఐటీడీఏలో పీఓ యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. రహదారులు, ఇతర భవనాల ప్రగతిని పీఓ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ట్రైకార్ డైరెక్టర్లు కె.కృష్ణారావు, పి.లావణ్య, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌వో గణేష్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి జాతర తేదీలు ఖరారు

- మార్చి 2, 3, 4 తేదీల్లో అమ్మవారి జాతర



చీపురుపల్లి: భక్తుల కొంగు బంగారం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర తేదీలు ఖరారయ్యాయి. మార్చి 2, 3, 4 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఏటా వలే మహాశివరాత్రి తరువాత వచ్చే శని, ఆది, సోమవారాల్లో అమ్మవా రి జాతర నిర్వహించేందుకు ఆలయ అధికారు లు నిర్ణయించారు. గతంలో సంక్రాంతి పండగ ముగిసిన వెంటనే జాతర తేదీలను ప్రకటించి, పోస్టర్లు విడుదల చేసేవారు. ఇంతవరకు దేవదాయశాఖ నుంచి అలాంటి ప్రకటనలు రాక పోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రు. అధికార పార్టీ ఇంతవరకు కొత్త కమిటీను నియమించకపోవడంతో జాతర నిర్వహణ అంశం చర్చనీయాంశంగా మారింది.

వినతుల పరిష్కారంలో జాప్యం ఉండకూడదు


వినతుల స్వీకరణలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని ఇంకనూ చూడవలసిన క్రమంలో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అన్నారు. వివిధ శాఖల అధికారుల వద్ద చూడకుండా ఉన్న వినతులు వెంటనే చూసి పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ప్రజల నుంచి 174 వినతులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ పదే పదే దరఖాస్తులు పెట్టేవారు, అలవాటుగా ప్రతి వారం పెట్టేవారి వివరాలను సమర్పించాలని వారి వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 34 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 34 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, పిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే .చౌదరి, ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారులు


నేషనల్ తైక్వాండో పోటీలకు వెళ్లనున్న క్రీడాకారులు

- నేటినుంచి హైదరాబాద్‌లో పోటీలు

విజయనగరం: ఈ నెల 28 నుంచి 30 వరకు 40వ సీనియర్, 7వ క్యాడెట్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో జరగనున్నట్లు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీ.హెచ్.వేణు గోపాలరావు తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. వారికి అసోసియేషన్, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ నుంచి ట్రాక్ షూట్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, జిల్లా తైక్వాండో చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అభినందనలు తెలుపుతూ పతకాలతో తిరిగి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర తైక్వాండో టీమ్‌కు కోచ్‌గా కె.చైతన్య వ్యవహరిస్తున్నట్లు ఆయన చెప్పారు.

సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ అసంబద్ధం

- జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు


మాట్లాడుతున్న జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు

రామభద్రపురం: సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ అసంబద్ధమని, అలా చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలువురు సర్పంచ్‌లతో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సచివాలయాల రేషనలైజేషన్‌తో సర్పంచ్‌ల బాధ్యత ఏమిటో తెలియ డం లేదన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలు తీసుకోకుండా హేతుబద్ధీకరణ నిర్ణయం తీసుకోవడం మంచిదికాదన్నారు. కార్యక్రమంలో దుప్పలపూడి సర్పంచ్ వై.భాస్కరరావు, పాతరేగ, నాయుడువలస, మామిడివలస సర్పంచ్‌ల ప్రతినిధులు నడిమింటి సత్యనారాయణ, గొట్టాపు నాయు డు, మూడడ్ల సోమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


వినతులను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ హేమలత

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌తోపాటు డీఆర్ఓ కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డిలు అర్జీదారుల నుంచి 105 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేసి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలని, అర్జీలను ఆడిటింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రగతిపై ప్రతివారం సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా సరైన కారణాలను అర్జీదారుకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్ మోహన్‌రావు, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డా.ఎస్. మన్మథరావు, డ్వామా, డీఆర్‌డీఏ పథక సంచాలకులు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ట్రైసైకిల్ పంపిణీ

తాను వికలాంగుడినని, నడవలేనని పీజీఆర్ఎస్‌లో ట్రైసైకిల్ కావాలని దరఖాస్తు చేసుకున్న సీతానగరం మండలం కోటసీతారాంపురం గ్రామానికి చెందిన సీతారాములుకు ట్రైసైకిల్‌ను సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అందజేశారు. దివ్యాంగులకు ప్రభుత్వ అందజేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.


ట్రై సైకిల్‌ను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదని ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 9 అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలపై విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.